ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కమలాపూర్, జనవరి 1 : మండలంలోని శంభునిపల్లి గ్రామానికి చెందిన మోడెం శ్రీనివాస్ (55)ఇంట్లో ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్నట్లు సీఐ హరికృష్ణ బుధవారం తెలిపారు. శ్రీనివాస్ బతుకు దెరువు కోసం పదేళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లాడు. అనారోగ్యం కారణంగా ఏడాది క్రితం స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. అక్కడి నుంచి వచ్చినప్పటి నుంచి తన ఉద్యోగం పోయిందని బాధ పడుతుండేవాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి చీరతో ఉరేసుకున్నట్లు చెప్పారు. అతడి కొడుకు వినయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ముస్త్యాలపల్లిలో మద్యం స్వాధీనం

దామెర, జనవరి 1 : మండలంలోని ముస్త్యాలపల్లిలో బెల్ట్‌షాపుపై దాడి చేసి రూ.2,380 విలువైన అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్సై కొంక అశోక్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కేదారి రమేశ్ అక్కంపేట–మొగిళిచర్ల రోడ్డులోని జయశంకర్ సర్కిల్ వద్ద బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు అక్కడికి వెళ్లి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాదీనం చేసుకుని రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

COURT NOTICE

IN THE COURT OF THE HON'BLE I ADDL. FAMILY COURT JUDGE, INTEGRATED FAMILY COURTS, CITY CIVIL COURT, AT HYDERABAD
F.C.O.P. No. 479 OF 2024
Between:
Smt. Bodige Mounika ...Petitioner
AND
Sri Chandra Prakash Kandagatla ...Respondent
To
Sri Chandra Prakash Kandagatla ...Respondent

Please take notice that Smt. Bodige Mounika filed the above F.C.O.P. to grant divorce by dissolving the marriage between the petitioner and you solemnized on **29-11-2013** and the matter is posted on **17-01-2025** for hearing.

If you have any objection regarding the petitioner claim as mentioned above, should appear before the Court on **17-01-2025** either in person or through your advocate, failing which the matter will be decided as per the law.

(BY ORDER OF THE COURT)
YADAVA RAJU PALLEBOINA, Advocate
Office: H.No. 1-8-702/51, Padma Colony, Nallakunta, Hyderabad-500 944,
Cell: 8886569876.

అస్తవ్యస్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

- రేషన్ షాపులకు ఇంకా చేరని బియ్యం
- ఆలస్యంగా అలాట్‌మెంటే కారణమంటున్న అధికారులు
- కొన్ని నెలలుగా ఇదే తంతు..
- జిల్లాలో 414 రేషన్ షాపులు.. రెండు ఎంఎల్ఎస్ పాయింట్లు

హనుమకొండ ఎంఎల్ఎస్ పాయింట్

హనుమకొండ, జనవరి 1 : జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. నిరుపేదలకు అందించే రేషన్ బియ్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి బియ్యం పంపిణీ చేస్తే ఇపుడు 10వ తేదీ వచ్చే వరకు బియ్యం ఇవ్వడం లేదని కార్డుదారులు వాపోతున్నారు. రేషన్ షాపులకు సమయానుసారం బియ్యం రాకపోవడమే ఇందుకు కారణమని రేషన్ డీలర్లు అంటున్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యం ఇప్పటి వరకు రేషన్ షాపులకు చేరలేదు. కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతున్నదని పలువురు డీలర్లు చెబుతున్నారు. అంతేకాక బియ్యం తూకంలో సైతం తేడాలు వస్తున్నాయంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి నెలా 30వ తేదీలోగా రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేస్తే మరుసటి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. కాని సివిల్ సప్లయ్ అధికారులు, రేషన్ డీలర్లు ఇవేమీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బియ్యం ఎప్పుడు పంపిణీ చేస్తారో తెలియక రేషన్‌షాపుల చుట్టూ తిరుగాల్సి వస్తున్నదని కార్డుదారులు వాపోతున్నారు. అంతేకాక గోదాముల్లో బియ్యం స్టాక్ లేకపోవడం కూడా మరో కారణమని కొందరు డీలర్లు అంటున్నారు. జిల్లాలో హనుమకొండ, పరకాల రెండు ఎంఎల్ఎస్ పాయింట్లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 414 రేషన్ షాపులు ఉండగా, వీటిలో కనీసం ఇప్పటి వరకు 50 శాతం షాపులకు రేషన్ బియ్యం పంపిణీ కాలేదని సమాచారం. వచ్చేది సంక్రాంతి పండుగ అప్పటి వరకైనా బియ్యం పంపిణీ చేస్తారో లేదోనని కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సివిల్ సప్లయ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలో సుమారు 2,16,758 కార్డుదారులకు 42,57,292 కేజీల బియ్యం పంపిణీ చేస్తున్నారు

రేషన్ షాపులకు చేరని బియ్యం..

ప్రజా పంపిణీ బియ్యం ఇప్పటి వరకు రేషన్ షాపులకు చేరలేదని డీలర్లు అంటున్నారు. కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతున్నదని వాపోతున్నారు. అంతే కాకుండా గోదాముల్లో స్టాక్ పెట్టకుండా వచ్చిన లారీలు వచ్చినట్లుగా తూకం వేయకుండా రేషన్ షాపులకు పంపిస్తున్నారని, దీంతో తూకంలో సైతం తేడాలు వస్తున్నాయని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే కొందరు డీలర్లు కూడా కార్డుదారులకు బియ్యం పంపిణీ చేసే విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే అరోపణలు ఉన్నాయి. నిరుపేదలకు పంపిణీ చేసే బియ్యం విషయంలో ప్రభుత్వ అలసత్వమో, అధికారుల నిర్లక్ష్యమో తెలవడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. హైదరాబాద్‌లోని సివిల్ సప్లయ్ కమిషనర్ కార్యాలయం నుంచి అలాట్‌మెంట్ ఆలస్యంగా రావడంతోనే రేషన్ షాపులకు బియ్యం సరఫరా లేట్ అవుతున్నదని ఆ శాఖ అధికారులు అనడం గమనార్హం. స్టేజ్ –1 కాంట్రాక్టర్లు సైతం సరిపోను వాహనాలు పెట్టకపోవడంతో ఆలస్యం అవుతున్నదని చెబుతున్నారు.

జిల్లాలో 414 రేషన్ షాపులు..

జిల్లాలో హనుమకొండ, పరకాల రెండు ఎంఎల్ఎస్ పాయింటు ఉన్నాయి. ఈ రెండు ఎంఎల్ఎస్ పాయింట్లలో మొత్తం 414 రేషన్ షాపులు ఉన్నాయి. హనుమకొండ స్టాక్ పాయింట్ లోని భీమదేవరపల్లి మండలంలో 25, ధర్మసాగర్‌లో 33, ఎల్కతుర్తిలో 22, హనుమకొండలో 55, హసన్‌పర్తిలో 46, ఐనవోలులో 26, కాజీపేటలో 42, వేలేరులో 16, మొత్తం 265 రేషన్ షాపులున్నాయి. అదేవిధంగా పరకాల స్టాక్ పాయింట్‌లోని ఆత్మకూరు మండలంలో 19, దామెరలో 15, కమలాపూర్‌లో 36, నడికూడలో 21, పరకాలలో 28, శాయంపేటలో 30, మొత్తం 149 రేషన్ షాపులుండగా వీటిలో ఇప్పటి వరకు కనీసం 50 శాతం రేషన్ షాపులకు బియ్యం సరఫరా కాలేదని తెలిసింది. ముఖ్యంగా పట్టణ పరిధిలో ఉండే ఒక్క రేషన్ షాపునకు బియ్యం సరఫరా కాలేదని డీలర్లు చెబుతున్నారు.

అలాట్‌మెంట్ ఆలస్యం అవుతున్నది..

- మహేందర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం

హైదరాబాద్‌లోని సివిల్ సప్లయ్ కమిషనర్ ఆఫీసు నుంచి అలాట్‌మెంట్ ఆలస్యంగా వస్తున్నది. జనవరి నెలలో పంపిణీ చేయాల్సిన కోటాకు సంబంధించి డిసెంబర్ 26వ తేదీన వచ్చింది. దీంతో రేషన్ షాపులకు బియ్యం పంపిణీ చేయడం ఆలస్యం అవుతున్నది. గోదాములలో కూడా నిల్వపెట్టేంత సరుకు రావడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి నెలా 30వ తేదీలోపు రేషన్ షాపులకు బియ్యం చేరాల్సి ఉంటుంది. కానీ అలాట్‌మెంట్ ఆలస్యం కావడంతో సరఫరా కూడా ఆలస్యం అవుతున్నది. దీంతో రేషన్ డీలర్లకూ మరో పది రోజుల గడువు ఇస్తున్నారు. రెగ్యులర్‌గా 15వ తేదీ వరకు కార్డుదారులకు పంపిణీ చేయాల్సి ఉండగా, 25వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నారు. మా దగ్గర ఎలాంటి ఆలస్యం జరగడం లేదు.

భీంపల్లి శివారులో ఎస్సారెస్పీ కాల్వలో పెరిగిన చెట్లు, ముళ్లపొదలు

కాల్వలు ఇలా.. నీళ్లు వచ్చేది ఎలా?

కమలాపూర్, జనవరి 1 : మండలంలోని ఎస్సారెస్పీ కాల్వల్లో ముళ్లపొదలు, చెట్లు, చెత్తాచెదారంతో పేరుకుపోయి అధ్వానంగా మారాయి. రెండు రోజుల క్రితం కరీంనగర్ ఎల్ఎండీ డ్యాం నుంచి అధికారులు సాగునీళ్లు వదిలారు. మండలంలోని భీంపల్లి, ఉప్పల్, కన్నూరు గ్రామాలకు వచ్చే ఎస్సారెస్పీ కాల్వ, కమలాపూర్, గూడూరు, వంగపల్లి కాల్వ, అంబాల, శ్రీరాములపల్లి, గూనిపర్తి, మాదన్నపేట ఎస్సారెస్పీ కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. ముళ్లపొదలు భారీగా పెరిగిపోయడంతో కాల్వలు కనిపించడం లేదు. దీంతో సాగునీళ్లు చివరి ఆయకట్టుకు వస్తాయో? లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కాల్వలను వెంటనే శుభ్రం చేయించాలని కోరారు.

ఆటో, బైక్ ఢీ.. ఆటోడ్రైవర్ మృతి

సాంబయ్య(ఫైల్)

కాశీబుగ్గ, జనవరి 1 : వరంగల్ 14వ డివిజన్ సుందరయ్యనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. సుందరయ్యనగర్‌కు చెందిన లాసాని సాంబయ్య(45) మంగళవారం రాత్రి ఆటోలో హసన్‌పర్తి వైపు వెళ్తున్నాడు. భీమారంలోని ఎస్‌వీఎస్ కాలేజీ ప్రాంతంలోకి చేరుకోగానే ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడడంతో సాంబయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనదారుడు గాయపడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఎనుమాముల ఆటో అడ్డా ఆటో కార్మికులు మృతుడికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎండీ సలీం, త్రికోవేరి వేణు, ప్రసాద్, యనమాల కృష్ణమూర్తి, అప్జల్, శ్యామ్, జావీద్, నగేశ్, సలీం, శ్రీధర్, యాకూబ్ అమీర్, రవి, వీరేందర్, రాజేశ్‌ఖన్నా పాల్గొన్నారు.

ఆర్టీసీ సురక్షిత ప్రయాణానికి చిరునామా

వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను

హనుమకొండ చౌరస్తా, జనవరి 1 : ఆర్టీసీ సురక్షిత ప్రయాణానికి చిరునామా అని వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను అన్నారు. రీజియన్ పరిధిలో జాతీయ రోడ్డు భద్రతా సదస్సు 1 నుంచి 31వ తేదీ వరకు జరుగుతున్న సందర్భంగా వరంగల్–1 డిపోలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని, రోడ్డుపై వాహనాలు నడుపుతున్నప్పుడు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, వరంగల్–1 డిపోను జీరో యాక్సిడెంట్ డిపోగా చేయాలన్నారు. డిప్యూటీ ఆర్ఎం ఆపరేషన్స్ కేశరాజు భానుకిరణ్ మాట్లాడుతూ.. దేశంలో రోడ్డు యాక్సిడెంట్ల వల్ల ప్రతి మూడు నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారని, ప్రమాదాల వల్ల ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఏప్రిల్ 2024 నుంచి నవంబర్ వరకు సుమారు 48 కోట్ల నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చిందని, డ్రైవర్ సురక్షిత డ్రైవింగ్ చేయాలన్నారు. డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు మాట్లాడుతూ.. ఇన్నర్ రోడ్ల నుంచి మెయిన్ రోడ్డుకు వచ్చే జంక్షన్ల వద్ద డ్రైవర్లు ఇరువైపులా చూసి బస్సులు నడపాలని, వాహనాల మధ్య సరైన దూరం పాటించి పూర్తి ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలని సూచించారు. బ్రహ్మకుమారీ సమాజం నుంచి ఈ కార్యక్రమానికి వచ్చిన సునీత మాట్లాడుతూ.. మనసు ప్రశాంతంగా ఉంచుకొని డ్రైవర్లు డ్రైవింగ్ చేయాలని, ఆర్టీసీ బస్సులపై ప్రయాణికులకు చాలా నమ్మకం ఉందని తెలిపారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్ఎం విజయభాను

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పలుచోట్ల పేదలకు దుస్తులు, దుప్పట్ల పంపిణీ
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నేతలు, వివిధ సంఘాల నేతలు

హనుమకొండ : చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న అనితారెడ్డి

నమస్తే నెట్‌వర్క్, జనవరి 1 : జిల్లాలో ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ఘనంగా జరిగాయి. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హనుమకొండ కనుకదుర్గకాలనీలోని క్యాంపు కార్యాలయంలో మల్లికాంబ మనోవికాస కేంద్ర మానసిక దివ్యాంగులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి దివ్యాంగులకు తినిపించి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. హనుమకొండలోని స్వధార్ మహిళల ఆశ్రమం, ఆనంద నిలయం బాలికల ఆశ్రమంలో అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు అనితారెడ్డి చిన్నారులతో కేక్ కట్ చేయించారు. అర్విికారెడ్డి, శైలజ, పావని పాల్గొన్నారు. కాజీపేట రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో రైల్వే కాంట్రాక్టర్ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో అనాథ పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (ఏడీఈ) కృష్ణంరాజు, అధికారులు విజయ్ శంకర్, సత్యారావు, బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేశ్, పాలడుగుల శివకుమార్, అప్జల్, దానం, యూత్ సభ్యులు రాజేశ్, ప్రదీప్, సురేశ్, సాయి, శ్యాం, దిలీప్ పాల్గొన్నారు. గ్రేటర్ 5వ డివిజన్‌లోని హనుమాన్ నగర్ ఫేజ్–1 కాలనీలో జరిగిన వేడుకల్లో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు కామరపు కిషన్, నిడిగొండ వెంకటస్వామి, చొల్లేటి శ్రీకాంత్, దూలం రాంబాబు, మొట్ల మనోహర్, వలస సాంబయ్య, ముత్తినేని రమేశ్, సాదుల రఘుపతి, రాజ్‌కుమార్, వెంకటేశ్, రవికిరణ్, కాలనీవాసులు పాల్గొన్నారు. నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ ఆలయానికి భక్తజనం పోటెత్తారు. కొత్త సంవత్సరం తొలి రోజు అమ్మవారిని దర్శించుకునేం దుకు బారులు తీరారు. హనుమకొండ సాయిబాబా మందిరంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కాజీపేట పట్టణం బాపూజీనగర్ లోని అల్ఫా ఓమెగా చర్చిలో ఫాదర్ బిషప్ జాన్ మార్కండేయ ఆధ్వర్యంలో నాయిని ప్రార్థనలు నిర్వహించారు. టీఎన్జీవోలు నాయినిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వేయిస్తంభాల దేవాలయంలో రుద్రేశ్వర స్వామికి 51కిలోల పెరుగుతో అభిషేకం చేశారు. స్వామి వారికి రుద్రాభిషేకాలు నిర్వహించినట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ ఈవో వెంకటయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. యాదాద్రి లక్ష్మీ నర్సింహ స్వామిని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆత్మకూరు ఇండియా పెంతెకొస్తు చర్చిలో పాస్టర్ పెరుమాండ్ల భాస్కర్ సరోజన ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అరూరి రమేశ్ కవితకుమారి దంపతులు ఐనవోలు మల్లికార్జున స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని ఇంట్లో డీసీసీ బ్యాంక్ అధికారులు, నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఐనవోలు మల్లికార్జునస్వామిని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా కుటుంబ సమేతంగా మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మామునూరు ఏసీపీ తిరుపతి, ఎస్సై పస్తం శ్రీనివాస్ ఉన్నారు.

51 కిలోల పెరుగుతో అభిషేకం చేస్తున్న ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ : మల్లికాంబ కేంద్రం చిన్నారులతో ఎంపీ, ఎమ్మెల్యే

కాజీపేట : అనాథలకు దుప్పట్లు అందజేస్తున్న రైల్వే ఏడీఈ కృష్ణంరాజు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దామెర, జనవరి 1 : మండలంలోని ఊరుగొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడని ఎస్సై కొంక అశోక్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామానికి చెందిన మైలగాని మల్లేశం (58) శాయంపేట మండలం పత్తిపాకలోని ఎస్‌వీసీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో విధులు ముగించుకుని స్వగ్రామం జయగిరికి బైక్‌పై వెళ్తుండగా ఊరుగొండ వద్ద వెనుకాల నుంచి అతివేగంతో వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మల్లేశం తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా అప్పటికే మల్లేశం మృతి చెందాడు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెప్టిక్ ట్యాంకులో పడి మరొకరు..

మడికొండ : మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని భట్టుపల్లి గ్రామంలో సెప్టిక్ ట్యాంకులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కథనం ప్రకారం.. ములుగు జిల్లా జంగాలపల్లికి చెందిన కేతిరి ఎల్లయ్య బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కూలి పని చేస్తున్నాడు. ఈ క్రమంలోనే భట్టుపల్లిలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటికి వాచ్‌మెన్‌గా పని చేస్తూ అక్కడే ఉన్న సెప్టిక్ ట్యాంకులో పడి మృతి చెందాడు. మృతుడి కూతురు పాలకుర్తి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సమ్మె చేస్తున్న సివిల్ సప్లయ్ గోదాం హమాలీలు

పెంచిన హమాలీ రేట్లు అమలు చేయాలి

పరకాల, జనవరి 1 : పెంచిన హమాలీ రేట్లు అమలు చేయాలని సివిల్ సప్లయ్ హమాలీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ సందీప్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాంలో హమాలీలు నిరవధిక సమ్మె చేపట్టారు. పెంచిన రేట్లను అమలు చేయాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సివిల్ సప్లయ్ గోదాంలో దిగుమతి, ఎగుమతి రేట్లను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందన్నారు. కానీ పెరిగిన రేట్లను అమలు చేసేందుకు జీవో జారీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా హమాలీ కార్మికులు సమ్మె చేపట్టామన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన రేట్లను అమలు చేస్తూ జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు గడ్డం సురేశ్, మచ్చ శంకర్, కృష్ణ, మహేందర్, భిక్షపతి పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన విద్యార్థి పార్థివదేహం

అమెరికాలో మృతి చెందిన వంశీ అంత్యక్రియలు పూర్తి

మృతదేహం వద్ద రోదిస్తున్న గ్రామస్తులు

కమలాపూర్, జనవరి 1 : మండలంలోని మాదన్నపేట గ్రామానికి చెందిన బండి వంశీ అనే విద్యార్థి మృత దేహం స్వగ్రామానికి బుధవారం చేరింది. అమెరికాలో ఎమ్మెస్సీ కోసం వెళ్లిన వంశీ అనుమానస్పద స్థితిలో డిసెంబర్ 21న మృతి చెందాడు. అతడి పార్థివదేహం 13 రోజులకు స్వగ్రామానికి చేరుకున్నది. లక్షలు ఖర్చు పెట్టి ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన వంశీ ప్రయోజకుడై కుటుంబానికి అండగా నిలుస్తాడనుకుంటే నిర్జీవంగా స్వగ్రామానికి రావడంతో కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు కన్నీళ్లు పెట్టించాయి. సాయంత్రం వంశీ అంత్యక్రియలు నిర్వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

హసన్‌పర్తి, జనవరి 1 : బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బోడ యుగేంధర్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను హనుమకొండలోని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ నివాసంలో బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ 66వ డివిజన్ అధ్యక్షుడు పాపి శెట్టి శ్రీధర్, గిన్నారపు రవీందర్, మేకల యుగేంధర్, శ్రీకాంత్, నరేశ్ ఉన్నారు.

అర్ధనారీశ్వరుని అలంకరణలో వీరభద్రుడు

అర్ధనారీశ్వరుని అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న వీరభద్రస్వామి

భీమదేవరపల్లి, డిసెంబర్ 1 : కొత్త కొండ వీరభద్రస్వామి బుధవారం అర్ధనారీశ్వరుని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఆలయ అర్చకులు స్వామివారికి విశేష అభిషేకం చేసిన అనంతరం అర్ధనారీశ్వరునిగా అలంకరించారు. సంవత్సర కాలంలో ఒక రోజు మాత్రమే స్వామివారు ఈ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని అర్చకులు మొగిళిపాలెం రాంబాబు, తాటికొండ వినయ్ తెలిపారు. నూతన సంవత్సరం కావడంతో భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో కిషన్‌రావు పూర్తి సదుపాయాలు కల్పించారు.

4న జిల్లాస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష

హనుమకొండ చౌరస్తా, జనవరి 1 : రాష్ట్ర విద్యాపరిశోధన మండలి ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ, రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల వేదిక జిల్లా శాఖ సంయుక్త నిర్వహణలో 4న పదో తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పరీక్ష నిర్వహిస్తున్నామని డీఈవో వాసంతి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, ప్రభుత్వ యాజమాన్యంలోని అన్ని రకాల గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో చదివే విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో 2వ తేదీ వరకు టాలెంట్ టెస్ట్ నిర్వహించి అందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వచ్చిన విద్యార్థులను 4న నిర్వహించే జిల్లాస్థాయి ప్రతిభాపాటవ పరీక్షకు తీసుకురావచ్చని చెప్పారు. జిల్లాస్థాయిలో నిర్వహించే ప్రతిభాపాటవ పరీక్ష మూడు కేటగిరీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు విద్యార్థులను ఎంపిక చేసి 21న నిర్వహించే రాష్ట్రస్థాయి పరీక్షకు పంపిస్తామన్నారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాల తెలుగు మీడియం కేటగిరి, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాల తెలుగు మీడియం కేటగిరి, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ మీడియం కేటగిరి, అన్ని రకాల రెసిడెన్షియల్ పాఠశాలల ఇంగ్లిష్ మీడియం కేటగిరీల్లో ముగ్గురు విద్యార్థులు చొప్పున రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి రూ.3, ద్వితీయ బహుమతి రూ.2, తృతీయ బహుమతి రూ.వెయ్యి చొప్పున నగదుతో పాటు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు అలిగిరెడ్డి మధుసూదనరెడ్డి 98498 34110, వడ్డేపల్లి సతీశ్‌ప్రకాశ్ 9440146460 నంబర్లలో సంప్రదించాలని జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOTS FOR SALE

★80% బ్యాంకు లోన్‌తో వరంగల్ హైవే ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ DTCP అప్రూవ్డ్ ప్లాట్స్, కంప్లీట్ CC రోడ్స్, ఎల్కట్రిసిటీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్యాంక్‌తో. సంప్ర: 8109994456.
NT-326623

WANTED

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338992-All

CHANGE OF NAME

★I, the undersigned **VEMULA YUGENDHAR** (New name) previously called **VEMULA YUGENDER** (Old name), S/o **VEMULA SOMALINGAM** R/o. H.No: 16-3-365, Flat no. 110, KVN Residency, Shanthinagar, Warangal-506002, TG, India and solemnly declare.
NTW-17435

WANTED

★నవ్యశ్రీ మహిళా వెల్ఫేర్ సొసైటీ వరంగల్ CBOలో పనిచేయుటకు అనుభవజ్ఞులైన అకౌంటెంట్స్ కావలెను. NGO'sలో CBOలలో అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. Qly: Commerce & Tally Accounting Package. సంప్ర: 9059149058, 9959209627.
NTW-00

CHANGE OF NAME

★I, **BATCHU SHRA